# ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను కలిసిన నాయకులు



బంగారు మీసాలను ఆలయ అధికారులకు అందజేస్తున్న భక్తుడు

## వీరభద్రస్వామికి బంగారు మీసాల బహూకరణ

కురవి, అక్టోబర్ 16: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన దూదిమట్ల దేవేందర్-కవిత దంపతులు బంగారు కోరమీసాల మొక్కును చెల్లించుకున్నారు. సుమారు రూ.35వేల విలువైన బంగారు మీసాలను సోమవారం ఆలయ అధికారులకు అందజేశారు. ఆనవాయితీ ప్రకారం పూజారులు దాత కుటుంబ సభ్యులకు గోత్రనామార్చన నిర్వహించారు. అదేవిధంగా అమ్మవారికి వెండి ముక్కుపుడకను అందజేశారు. దాత కుటుంబ సభ్యులు, డీ వెంకన్న, ఎన్ రామచంద్రు, కోడి భిక్షం పాల్గొన్నారు.

***రుద్రాక్ష మొక్క నాటిన ఈవో దంపతులు***

వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో భక్తుడు, కురవి గ్రామానికి చెందిన వేమిశెట్టి శరత్ ప్రత్యేకంగా తెప్పించిన రుద్రాక్ష మొక్కను ఆలయ ఈవో సత్యనారాయణ దంపతులు నాటారు. రుద్రాక్ష మొక్క మహిమాన్వితమైనదని, పవిత్ర స్థలంలో నాటిన మొక్కను భక్తులు రక్షించుకొని వృక్షంగా మార్చుకోవాలన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు.



కురవి: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

## గాయత్రీదేవి అలంకరణలో దుర్గాదేవి

కురవి: కురవి, సీరోలు మండలాల్లో దేవీ శరన్నవరాత్రులు సోమవారం రెండో రోజు కొనసాగాయి. అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండపాల నిర్వాహకులు శాస్త్రోయుక్తంగా పూజలు నిర్వహించారు.

***డోర్నకల్‌లో ప్రత్యేక పూజలు***

డోర్నకల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని దుర్గాదేవి విగ్రహాల వద్ద అమ్మవారు గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

***సామూహిక మహారుద్రాభిషేకం***

కేసముద్రం: మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో వాసవి మిత్రమండలి ఆధ్వర్యంలో దుర్గాదేవి మండపం వద్ద మహారుద్రాభిషేకం నిర్వహించారు. కల్వలలో ఆంజనేయస్వామి ఆలయంలో గోపూజ చేశారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. చిలంచర్ల సతీశ్, ఓమ సంతోష్, శ్రీరాం చంద్రన్‌కుమార్, లెంకలపల్లి సంతోష్, తాటికొండ సుగుణా సాగర్, మాలె రవి, ఓలం ప్రభుకిరణ్, ప్రకాశ్, బోనగిరి శ్రీధర్, బోనగిరి శ్రీకాంత్, గంట రామ్మోహన్‌రెడ్డి, మూల వెంకట్‌రెడ్డి ఉన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షలు

తొర్రూరు, అక్టోబర్ 16: మండలంలోని వివిధ గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికులకు కార్మికశాఖ ఆధ్వర్యలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలో 53 రకాల అనారోగ్య సమస్యలను గుర్తించి మందులను అందజేశారు. కార్మికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు చిన్నాల స్వామి, ప్రధాన కార్యదర్శి గూడెల్లి నారాయణ, మల్లేశ్, రామచంద్రు, రమేశ్, శ్యామ్, యాకన్న, యాకయ్య, వైద్య బృందం పాల్గొన్నారు.



కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



నర్సింహులపేట: ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పార్టీ నాయకులు

నర్సింహులపేట, అక్టోబర్16: హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ చేతులమీదుగా బీ ఫాం అందుకోవడంతో నియోజకవర్గ నాయకులు సోమవారం ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టేకుల యాదగిరిరెడ్డి, బీ కిషన్‌నాయక్ ఉన్నారు.

***బీఆర్‌ఎస్ నాయకుల సంబురాలు***

చిన్నగూడూరు: ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధించి కేసీఆర్ మూడోసారి సీఎం అవడం ఖాయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డీఎస్ రాంసింగ్ అన్నారు. సోమవారం సీఎం కేసీఆర్ చేతులమీదుగా ఎమ్మెల్యే రెడ్యానాయక్ బీఫాం అందుకున్న సందర్భంగా మండల కేంద్రంలోని దాశరధి సెంటర్‌లో పటాకులు కాల్చి, సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన రెడ్యానాయక్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, నాయకులు చెన్నయ్య, కొమిరెల్లి, వైస్ ఎంపీపీ వీరన్న, కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌బేగ్, సర్పంచ్ మల్లయ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఉప్పలయ్య, యాకి, కేసముద్రం మార్కెట్ డైరెక్టర్ శ్రీరాములు, నాయకులు వేణు, శ్రీను, అంబరీష, సత్యనారాయణ, చిరంజీవి, బిచ్చ, వెంకన్న, మల్లయ్య, జోసఫ్ తదితరులు పాల్గొన్నార.

***సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకోవడంతో నియోజకవర్గంలో సంబురాలు***



చిన్నగూడూరు: పటాకులు కాల్చుతున్న నాయకులు

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

కురవి(సీరోలు), అక్టోబర్ 16: సీరోలు మండలం గోపాతండాలో పక్కా సమాచారంతో సోమవారం తెల్లవారుజామున గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. గుడుంబాను స్వాధీనం చేసుకొని, తయారీకి సంబంధించిన వస్తువులను ధ్వంసం చేశారు. పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాదేవి తెలిపారు.



గూడూరు: పట్టుకున్న గుడుంబా, బెల్లంను చూపుతున్న ఎస్సై రాణాప్రతాప్

***5క్వింటాళ్ల బెల్లం, 50 కిలోల పటిక స్వాధీనం***

గూడూరు: మండలంలోని చక్రుతండా, పిల్లిగుండ్ల తండాల్లో పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 5క్వింటాళ్ల బెల్లం, 50 కిలోల పటిక, 70 లీటర్ల గుడుంబా, 1500 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకొని బాధ్యులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రాణాప్రతాప్ తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎవరూ గుడుంబా, నల్లబెల్లం అమ్మవద్దని సూచించారు.



కురవి: స్వాధీనం చేసుకున్న గుడుంబా, బెల్లం పానకాన్ని చూపుతున్న ఎస్సై రమాదేవి

## సబ్సిడీ విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు




గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్



ఏడీఏ లోక్‌నాథ్‌రెడ్డి

మరిపెడ, అక్టోబర్ 16: సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు గృహ విద్యుత్ వినియోగం కోసం రాయితీపై వందయూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేస్తున్నది. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఇందుకు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ట్రాన్స్‌కో అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మరిపెడ సబ్ డివిజన్ పరిధిలోని చిన్నగూడూరు, నర్సింహులపేట, ఎల్లంపేట, మరిపెడ, దంతాలపల్లి మండలాల్లోని విద్యుత్ కార్యాలయాల్లో వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా మరిపెడ ఏడీఏ లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ప్రభుత్వం100యూనిట్ల గృహ విద్యుత్ ఉచితంగా అందిస్తున్నదని, మరిపెడ ట్రాన్స్‌కో సబ్ డివిజన్ పరిధిలో లక్ష కుటుంబాలకు ఈ పథకం వల్ల లబ్ధి చేకూరుతుందన్నారు.

## పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా అనిల్



ఇరుగు అనిల్

నెల్లికుదురు, అక్టోబర్ 16: మండలంలోని బంజర గ్రామానికి చెందిన ఇరుగు అనిల్ ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఈ నెల 12,13 తేదీలో జరిగిన రాష్ట్ర 8వ మహాసభల్లో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

వడివడిగా

## ముదిరాజ్ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు

మరిపెడ, అక్టోబర్ 16: మున్సిపల్ కేంద్రంలో రూ. 15లక్షలతో చేపట్టిన ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే రెడ్యానాయక్ చొరవతో సీఎం కేసీఆర్ ప్రభుత్వం కమ్యూనిటీ హాల్ కోసం నిధులు మంజూరి చేసింది. చివరి దశకు వచ్చిన పనులను సోమవారం ముదిరాజ్ సంఘం జిల్లా నాయకుడు బయ్యా ఉపేందర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు గ్రామాల్లో మెరుగైన ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సీఎం కేసీఆర్‌కు మత్స్యకారులు రుణపడి ఉంటారని పేర్కొన్నారు.



కొనసాగుతున్న భవన నిర్మాణ పనులు

## ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు బిల్లులు సమర్పించాలి

జనగామ చౌరస్తా, అక్టోబర్ 16 : జిల్లాలోని జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ప్రింటింగ్ ప్రెస్, డిజిటల్ ఫ్లెక్సీ దుకాణా నిర్వాహకులు వివిధ పార్టీలకు చెందిన ఎన్నికల ప్రచార ముద్రణల వివరాలు వెంటనే సమర్పించాలని జిల్లా ఎన్నికల సహాయ అధికారి సుహాసిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్సీ నిర్వాహకులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుహాసిని మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల ఫ్లెక్సీలు, హోర్డింగ్స్, కరపత్రాలు ముద్రిస్తే వాటి బిల్లులను తన కార్యాలయంలో అప్పగించాలని తెలిపారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడు పరశురాములు, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.